# జ్ఞానదర్శిని

సంపుటి : 1 జనవరి - మార్చి 1996 సంచిక : 4

జ్ఞాన, విజ్ఞాన, కర్మ, భక్తి, హఠ, రాజ, పూర్ణ యోగాలు వివరించే ఆధ్యాత్మిక త్రైమాస పత్రిక



THE SAINT AND THE SCIENTIST Prof. SWAMI JNANANANDA TRUST,
SRI RAMA JNANAMANDIR, GORAGANAMUDI - 534 244

# THY OWN RELIGION

*There shines and ever shines in thee,*
*The effulgent Divinity ever free;*
*And this thou dost not know and see,*
*Whatever Its effulgence might be;*
*For potential It verily seems to be,*
*As if Its divine It conceals from thee,*
*In this the ever changing nature's fold,*
*Which is out of thy grip and thy hold.*
*Then here begins thy work divine,*
*With a control, thy steady control fine,*
*Of nature and of its binding forces all,*
*Whom Maya the ancients preferred to call,*
*Either by love divine or selfless act,*
*Or by control psychic or philosophic tact,*
*By each or even by the help of more;*
*And as stated in the scripts of ancient lore,*
*Manifest then the Divinity within,*
*Which is beyond each and every sin;*
*And thus know that thou art That,*
*Which is beyond the why and the what,*
*As that Divinity transcends Maya's region:*
*Well, this is religion, thy own religion.*

ఆంగ్లము:
శ్రీ స్వామి జ్ఞానానంద
అనువాదము:
శ్రీ భూపతిరాజు పద్మనాభరాజు

# నీ యొక్క స్వకీయ మతము

నీలో అఖండ దివ్యజ్యోతి అఖండముగా ప్రకాశించుచున్నది. అది ఎంత ప్రకాశవంతమైనదైనను నీవు తెలుసుకొనలేవు, చూడలేవు, ఎల్లప్పుడు మార్పుచెందు ఈ ప్రకృతి (మాయ) నీ స్వాధీనము తప్పినది. అందు నీ నుండి మరుగుపడవలెనో యన్నట్లు దివ్యజ్యోతి నిగూఢమగుచున్నది. అట్టి నిగూఢమగు దివ్యజ్యోతిని పొందుటకు ఇక నీవు చేయవలసిన ఆధ్యాత్మిక సాధనకు ఉద్యుక్తుడవు కమ్ము. పురాణ పురుషులు దేనినైతే మాయగా పరిగణించెదరో, అట్టి ప్రకృతి దాని సంబంధమగు శక్తులను భక్తియోగము (దివ్యప్రేమ) వల్ల కాని, కర్మయోగము (నిష్కామకర్మ) వల్ల కాని, జ్ఞానయోగమువల్ల కాని, మరి పై చెప్పిన అన్నియోగముల కలయిక వల్ల కాని నెమ్మది, నెమ్మదిగా స్వాధీన పరచుకొనవలెను. అప్పుడు జ్ఞానము శాస్త్రములందు వివరించిన విధముగా మాయాతీతమగు దివ్యత్వము నీ యందు బయల్పడును. ఎందుకు? ఏమిటి? అను ప్రశ్నలకు అతీతమగు ఆ పరమ సత్యమును నీవుగా తెలుసుకొందువు. మాయాపరిధిని అతిక్రమించి దివ్యత్వమును పొందుదువు. ఈ మతమే నీ యొక్క మతము.



శ్రీ స్వామి జ్ఞానానంద సేకరించిన అపురూప కృష్ణ విగ్రహం

*గౌరవ సంపాదకులు*
శ్రీ భూపతిరాజు పద్మనాభరాజు,
గొరగనమూడి

*సంపాదకులు*
డా॥ అక్కిరాజు రమాపతి రావు

*సంపాదక సలహా మండలి*
శ్రీ దంతులూరి బాపిరాజు
కోపల్లె

శ్రీమతి డా॥ బి. ఉషారాజు ఎం.డి., U.S.A.

ప్రొ. ఎ. లక్ష్మీనారాయణ - న్యూక్లియర్ ఫిజిక్స్
డిపార్ట్‌మెంట్
ఆంధ్రా యూనివర్సిటీ, వాల్తేరు

డా. ఎ.వి. నరసింహారాజు ఎం.ఎ., పిహెచ్.డి.,
గుంటూరు

శ్రీ సి.హెచ్. జగన్మోహన్
సంస్కృతోపాధ్యాయుడు,
శ్రీ స్వామి జ్ఞానానంద హైస్కూల్,
గొరగనమూడి

శ్రీ సి.హెచ్. చెన్నకృష్ణయ్య
సికింద్రాబాద్

శ్రీ కె. సూర్యనారాయణ రాజు
సికింద్రాబాద్

శ్రీ పి.వి.ఆర్. రాయుడు,
హైదరాబాద్

*ప్రచురణ:*

The Saint and the Scientist
Prof. Swami Jnananda Trust,
Sri Rama Jnanamandir,
Goraganamudi - 534 244
West Godavari Dt.

# జ్ఞానదర్శిని

సంచిక : 1 సంపుటి : 4

జనవరి - మార్చి 1996

వెల: విడి ప్రతి 10 రూ.

## ఈ సంచికలో....

సంపాదకీయం -
బ్రహ్మోపాసనా -
వేదోఽఖిలో ధర్మమూలం - 3
నా జ్ఞాపకాల్లో శ్రీ జ్ఞానానంద స్వామీజీ 7
సర్వయోగపరిపూర్ణుడు - 8
రాధాష్టమి 9
శ్రీ స్వామి ప్రణవానంద శతజయంతి - 12
శ్రీ రామయోగి - 16
ఆధ్యాత్మిక యోగ సాధకుడు
పాల్ బ్రంటన్ - 18
శ్రీ స్వామి జ్ఞానానంద జనకులు
శ్రీ భూపతిరాజు రామరాజు - 21
స్మృత్యంజలి - 23
శ్రీ స్వామి జ్ఞానానంద
శతజయంతి ఉత్సవములు - నివేదిక - 24
Sri Swamiji - A Tribute - 27
Swamy Jnanananda,
The Purna Purusha - 28
Jnanananda Ophthalmic Institute - 29
My Impressions of Swamiji - 30
Divine Flashes of
Dr. Swami Jnanananda - 32
Letters - 34
Book Review - 35

# GURUDEVA

For Ever I Salute my master own
Sri Jnanananda the Effulgent one
Whose grace and goodness verily destroy
The ignorance and this our nescience both
Om tat sat

# బ్రహ్మోపాసనా

దిక్కాలాద్యనవచ్ఛిన్నం నిష్కలం యన్నిరన్తరమ్ ।
నిర్వికల్పం పరాత్మానం నిర్వికారంచ నిర్గుణమ్ ।
అనన్తం సచ్చిదానందం అవాఙ్మానసగోచరమ్ ।
అద్వయం స్వప్రకాశంచ బ్రహ్మతత్త్వ ముపాస్మహే ॥

*- శ్రీ స్వామి జ్ఞానానందకృతమ్*

## సంపాదకీయం

## భారతీయ గురుపరంపర

మానవ జీవితానికి అర్థం ఏమిటి? పరమార్థం ఏమిటి? కార్యకారణ సంబంధం ఏమిటి? అని యుగ యుగాలుగా వేలాది సంవత్సరాలుగా భారతీయ మహర్షులు, ఆచార్యులు, తత్త్వవేత్తలు, పరివ్రాజకులు గవేషిస్తూనే ఉన్నారు. ప్రబోధిస్తూనే ఉన్నారు. 'ఈ సృష్టికి ఏ మర్మం? ఒక సకలాతీత శక్తి ఉన్నట్లా లేనట్లా?' అనే విచికిత్సను విశ్లేషిస్తూనూ ఉన్నారు. సృష్టి రహస్యాన్ని, తాము దర్శించినదానిని ప్రకటిస్తూనూ ఉన్నారు. మానవ జీవితంలో దుఃఖం, అసంతృప్తి, ఆవేదన, నిర్వేదం, కష్టం, కార్పణ్యం, ఆందోళన చిరకాలంగా అనుభూతమవుతూనే ఉన్నాయి. వీటన్నిటిని పరిహరించడం ఎట్లా అనేదే మహాత్ముల నిరంతర జిజ్ఞాస. వాళ్ళు దర్శించిన సత్యాన్ని మానవాళికి ఎప్పటికప్పుడు వారు ప్రవచిస్తూనే ఉన్నారు. ఆనందస్వరూపం యొక్క అంతర్గత లక్షణాలను వారు వివేచించి మానవాళికి తెలుపుతూనూ ఉన్నారు.

'పుట్టుట నిజము, గిట్టుట నిజము, నట్టనడుమదినాటకము' అన్నారు సంకీర్తన సార్వభౌములు అన్నమాచార్యులవారు. మహాభారతంలోని వన పర్వంలోని యక్ష ప్రశ్నల ఘట్టంలో ధర్మరాజు విజ్ఞతను, విచక్షణతను ప్రశ్నించగోరిన యక్షుడు ఆయనను ఒక విచిత్రమైన ప్రశ్నను అడుగుతాడు? ఈ ప్రపంచంలో అన్నిటికన్నా వింతలలో కెల్ల వింత

ఏది? అని! దానికి ధర్మరాజు సమాధానం ఏమని చెప్పాడంటే ప్రతిరోజూ తమ కంటి ముందే ఎందరో చనిపోతూ ఉండగా ఆ ఘట్టాన్ని చూస్తున్న ఇతరులు తాము ఈ ప్రపంచంలో శాశ్వతంగా ఉండగోరుతున్నారు; అథవా ఉండగలమని అనుకుంటున్నారు. ఇంతకన్నా వింత మరేమైనా ఉంటుందా? అని తానూ ఒక ప్రశ్నరూప సమాధానాన్ని విన్నవించుకున్నాడు ధర్మరాజు. ('అహన్యహని భూతాని గచ్ఛంతీహ యమాలయం,శేషాః స్థిరత్వ మిచ్ఛన్తి, కిమా శ్చర్యమితః పరం').

విప్లవ కవి అనీ హేతువాద ప్రాశ్నికుడనీ అనిపించుకున్న శ్రీశ్రీ కూడా 'ఎవరు చూడబోయినారు మూడు ఏభైలు' అన్నాడు. అంటే నూట ఏభై సంవత్సరాలు ఎవరూ జీవించరు కదా అని విచికిత్స?! అసలు ఈ జనన మరణాల స్వరూప స్వభావాలేమిటి? కొందరు జీవితంలో ఘోరమైన విపత్తులను ఎదుర్కోవటం ఎందుకు? దారిద్ర్యం, అనారోగ్యం, గడవరాని కష్టాలు అనుభవించటమెందుకు? మరి కొందరు సాపేక్షికంగా సుఖపడుతున్నట్లు, కష్టాలు వచ్చినా వాటిని గట్టెక్కుతున్నట్లూ కనపడటం ఏ విధంగా సంభవిస్తున్నది? అనే ప్రశ్నలకు ఆధ్యాత్మికవేత్తలు చెప్పే వివరణలు సామాన్య మానవులు అర్థం చేసుకోవడం కష్టం. దుఃఖం చవిచూడని, మృత్యుదేవత ఛాయ ఏనాడూ సోకని ఇంటి నుంచి ఒక పిడికెడు ఆవాలు తీసుకొని వస్తే నీ కొడుకుని బ్రతికిస్తానని పుత్రమరణ విహ్వలురాలు, శోక సంతప్తసందష్ట అయిన ఒక వృద్ధురాలిని గౌతమ బుద్ధుడు సమాశ్వాసించినట్లుగా బుద్ధచరితలో ఒక గాథ ఉన్నది. ఆ విధంగా దుఃఖఛాయ సోకని నరమానవుడెవడైనా ఉన్నాడా? అది సాధ్యమా?

ప్రపంచంలో జీవించి ఉన్న వారి కంటే చనిపోయిన వాళ్ళే ఎక్కువ అంటారు ఒక కథలో ప్రసిద్ధ తెలుగు కథా రచయిత శ్రీ మధురాంతకం రాజారాం. ఎప్పటికైనా అధికసంఖ్యాకుల పక్షం చేరవలసిన వాళ్ళే ఎవరైనా? 'మహాజనాః ఏన గతస్సపంధాః' అని కదా ఆర్యవాక్యం!

దుఃఖం వద్దయ్యా! వద్దమ్మా! ఆనందంగా ఉండే మార్గం చూపుతామని వేల సంవత్సరాల నుంచీ భారతీయ గురుపరంపర బుజ్జగించి, లాలించి, అభయహస్తం చూపి, సంరక్షణ హస్తం సాచి మానవాళిని ప్రబోధిస్తూనే ఉన్నది.

భారతీయులకు వేదాలు ఉన్నాయి. వేదాంతమున్నది. వేదాంత మంటే ఉపనిషత్తులు. పురాణాలున్నాయి. ధర్మశాస్త్రాలున్నాయి. ఇంత సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వం, ధార్మిక వాఙ్మయం మరేదేశానికీ లేదేమో! వేద వేదాంతాలు, ధర్మశాస్త్రాలు మనిషిని న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా నడుచుకోవలసిందిగా బోధిస్తున్నాయి. వాటి ఆధారంగానే భారతీయ గురుపరంపర భక్తి జ్ఞాన కర్మ మార్గాలను వీలైనంత సుబోధకంగా మానవాళికి వ్యాఖ్యానించి చూపింది. నేటికీ చూపుతున్నది. మనకు బాగా తెలిసిన చరిత్ర రెండువేల సంవత్సరాల నుంచీ ఉన్నది. మరీ గడచిన రెండు వందల సంవత్సరాల చరిత్ర చాలా స్పష్టంగా మనకు తెలుసు. అలనాటి ఆదిశంకర భగవత్పాదుల నుంచి నేటి శ్రీ రామకృష్ణ పరమహంస, వివేకానంద, అరవింద, భగవాన్ శ్రీ రమణ మహర్షి, రామతీర్థస్వామి, నారాయణ గురు, స్వామి జ్ఞానానందల వరకు మన గురుపరంపర భారతీయ ఆధ్యాత్మిక తత్త్వ జ్ఞాన దివ్య వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు.

అలనాడు శంకరులు బ్రహ్మసూత్రాలను వ్యాఖ్యానం రచించినట్లే శ్రీ స్వామి జ్ఞానానంద భక్తి జ్ఞాన కర్మరాజయోగాల సమన్వయ సమాహార వ్యాఖ్యాన సూత్రబద్ధ పూర్ణసూత్ర సంపుటిని ప్రపంచానికి అందజేశారు.

పూర్ణసూత్రాలు విశ్వచైతన్యాన్ని సముద్దీప్తం చేయగలవు. విశ్వమానవాళికి చక్కని రాజమార్గాన్ని చూపగలవు.

# వేదోఽఖిలో ధర్మమూలం

- శ్రీ యనమండ్ర వేణుగోపాల శాస్త్రి
విజయనగరం

మాయామేయమైన ఈ జగత్తులో మానవునకు పరమోత్కృష్ట స్థితి కలదు. సమస్త జీవులకు ఉద్గతికైనా అధోగతికైనా మానవజన్మమే మూలమగుచున్నది. కనుకనే చతుర్దశ భువనములతో కూడిన ఈ బ్రహ్మాండమునందు భూలోకము మధ్యమ లోకమని వ్యవహరింప బడుచున్నది. ఊర్ధ్వలోకములన్ని కేవలము సుఖ ప్రాయములు. అధోలోకములు కేవలము దుఃఖ ప్రాయములు. భూలోకము సుఖ దుఃఖ మిశ్రితమైనది. కేవలము దుఃఖములోగాని సుఖములో గాని చిక్కుకున్న ప్రాణులు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడగు పర మాత్మకు దూరమగుదురు. ఆ పరమాత్మను తెలిసికొనుటయే సరియైన జ్ఞానము. అట్టి జ్ఞానము సుఖ దుఃఖాతీత విషయమై "నేతి నేతీ"తి విచారణ వలన పరిశుద్ధమగును. ఆ జ్ఞానము నిత్యము సత్యము చిదానన్ద రూపమైనది. అట్టి జ్ఞానము ఒక్క మనుష్యజాతికి మాత్రమే సాధ్యమగును. ఆ పరమాత్మను తెలిసికొనుటకు ప్రతిబంధకములు ఈలాగు కలవని ప్రజలను గూర్చి వేదము ఈ విధముగా ప్రబోధించుచున్నది.

**"నతం విదాథ యఇదం జజా నాన్య ద్యుష్మాక మన్తరంబభూవ|**
**నీహారేణ ప్రావృతా జల్ప్యా చాసుతృప ఉక్థ శాస శ్చరన్తి|| "**

ఓ ప్రజలారా! సమస్త విశ్వమును సృజించి విశ్వకర్మయని వ్యవహరింపబడు పరమాత్మ, మీ దవ్వులో ఉన్ననూ మీరు తెలియలేకున్నారు. దానికి నాలుగు కారణములు గలవు.

1. మంచు చేత కప్పబడిన కాష్ఠ పాషాణాదులు స్వరూప స్థితిని కోల్పోయినట్లు, అజ్ఞానము చేత ఆవరింపబడిన స్వరూపస్థితిని తెలియలేకున్నారు. మంచువంటి అజ్ఞానము చేత కప్పబడియున్నారు.

2. "జల్ప్య" అనగా అసత్య వ్యవహారము. నాటకమునందలి నటులకు సీతారామాది పాత్ర ఎలా సత్యము కానిదో నామ రూపాత్మకమగు ఈ జగన్నాటక రంగస్థలము నందు యజ్ఞదత్త దేవదత్త, మున్నగు మీ పేర్లు గాని మీ రూపములు గాని నిత్యసత్యములైనవి కావు. అవే సత్య నిత్యములని భ్రమించి తాదాత్మ్యము చెందుచున్నారు. "జల్ప్య" అను మాయ చేత కప్పబడియున్నారు కనుక పరమాత్మను తెలియకున్నారు.

3. "అసుతృప" అనగా ప్రాణతృప్తికై పాటుబడుచున్నారు. సమస్త ప్రాణికోటి "దుఃఖం మా భూత్, సుఖంమే భూయాత్" అని కోరుచున్నది. అనగా:- నాకు దుఃఖము వద్దు సుఖము కలుగవలెను అని భావించి సంసారమందు ప్రవృత్తమగుచున్నది. ప్రాణికోటి కోరునది ఐహికమైన ఆభాసిక సుఖమునే కాని నిత్య సత్యమగు ఆనన్దమును కాదు. పిడికెడు ప్రాణములను నిలుపుకొనుటకు పడరాని పాట్లు పడుచు శిశ్నోదర పరాయణులై అర్థకామములకు అంకితమై ఆభాసిక సుఖములను అనుభవించుటకు ఆయుర్దాయము సరిపోక మృత్యువ్రాతమునకు భయపడి ఆయుర్దాయ అభివృద్ధికి సాధ్య మయినంత వరకుశక్తివంచన లేకుండా ప్రయత్నము చేయుటలో మునిగియున్నారు.

4. "ఉక్థశాసః" అనగా ఉక్థప్రఉగము అను శాస్త్రములో దేవతలను స్తుతించి కామ్యకర్మల నాచరించుచు ఇహలోక సుఖములే కాక ఆముష్మిక సుఖములను కూడా కోరుచు స్వర్గాదిసుఖములు కూడా ఆభాసికములని భావించక విలువగు మానవ

జన్మను వృధా కావించుకొనుచున్నారు. "తేతం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి" అని గదా శాస్త్రము. ఏ ఉత్తమ లోకములైనా పుణ్యఫలానుభవానంతరము మరల మర్త్య లోకమునకు రావలసిందే. అప్పుడు ఆ జీవుడు మర్త్యుడై పుడతాడని ఎవరు నిర్ణయించగలరు? "యద్యద్భవ్యంభవతిభగవన్ పూర్వకర్మాను రూపమ్" అని పెద్దలు చెప్పుదురు. కనుక ఓ ప్రజలారా! అజ్ఞానకార్యములగు ఈ నాలుగింటిని విచారించి సరియగు ప్రయత్నము చేసినచో యథార్థముగా పరమాత్మను తెలిసికొనుచున్నారు. ప్రకృతి పురుషాత్మకమైన ఈ సృష్టిలో తన స్థితి ఏమిటో జగత్సృష్టికి మూలకారణము ఏదియో తెలుసుకొన గలిగిన జీవి ఒక్క మనుష్యుడు మాత్రమే. ఎనుబది నాలుగు లక్షల జీవరాశులలో మనుష్యునకు ఉత్కృష్టత ధర్మమాత్రము చేతనే ఆపాదితమగు చున్నది.

సత్యము తెలియబడునది. ధర్మము ఆచరింపబడునది. అనగా ధర్మాచరణ చేత జగత్సత్యము తెలియబడును. తెలియబడిన జగత్సత్యము ధర్మాచరణ చేతనే నిర్ధారితమగును. సత్యము థీరీ అని - ధర్మము ప్రాక్టికల్ అని చెప్పవచ్చును. ప్రాపంచిక సత్యధర్మములు, పారమార్థిక సత్యధర్మములు అని రెండు తెరంగుల దృష్టితో విచారించినచో విజ్ఞానము ప్రాపంచికమైనది - జ్ఞానము పారమార్థికమైనదిగా వేదములు తెలుపుచున్నవి. పంచభూతాత్మకమగు ఈ విశ్వములో పదార్థ జన్యజ్ఞానము విజ్ఞానముగను, దేశ కాలములచేత పరిచ్ఛిన్నమైన పదార్థము కంటే అతిరిక్తమై భావగోచరమై, సమస్తభావములకు అతీతమై,మనోవాచామగోచరమగు జ్ఞానమే సరియగు జ్ఞానమని సకల వేదసమ్మతి. విజ్ఞానమంతయు వేదముల పూర్వభాగమై యుండగా - జ్ఞానము ఉపనిషద్రూపమై ఉత్తర భాగములుగా అలరారుచున్నది. వీటినే ఉపనిషత్తులని, వేదాన్తములని ఋషులు వ్యవహరింతురు. సమగ్రమైన వేదముల యొక్క ఆధారముతోనే జ్ఞాన విజ్ఞానములను అన్వయించుకొనుట అనాదిగా ఓతప్రోతముగా ఋషి సంప్రదాయము సాగుచునే యున్నది.

"మన ఏవ మనుష్యాణాం కారణం బన్ధమోక్షయోః" అను ప్రమాణము ననుసరించి మనస్సు కలవాడు మనుష్యుడు. ఆ మనస్సే అసద్విచారణ చేత జీవిని సంసారమునందు బంధించుచున్నది. సద్విచారణచేత జననమరణ రూపమగు సంసార చక్రము నుండి తప్పించి అమృతత్వమును కలిగించుచున్నది. ఇట్టి మనస్సులేని 99,999 జీవరాశులు సద్విచారణ చేయలేక కేవలము శిశ్నోదర పరాయణులై ప్రకృతి ధర్మము నాశ్రయించి ప్రాకృత ప్రాణులని, పశువులని, జంతువులని వ్యవహరింపబడుచున్నవి మనస్సు ఉండి వివేక శూన్యుడై సద సద్విచారణ లేని మనుష్యుడును వాటి వలె సంచరించుచు వాటితో సమానుడగుచున్నాడు. తప్పు - తప్పు వాటికంటే హీనుడగుచున్నాడు.

ఎందువల ననగా:- సమస్త జీవరాశి యొక్క చర్మమో- మాంసమో, ఎముకలో, కేశములో తుదకు బొడ్డున మట్టి కూడా అమోఘమైన ఉపయోగము కలిగించుచూ పరోపకారత్వమును సూచించుచూ విషాది ప్రాబల్యముచేత మనుష్యునికంటే ప్రబలమయ్యును, స్వార్థైక జీవనుడైన మనుష్యునిచేత చంపబడి, బాధింపబడి, వశీకృతములై స్వస్థాయిని కోల్పోయి పరతంత్రము లగుచున్నవి. అందుచేతనే మనుష్యునకు - ఇతర జీవరాశులకు "మృతి" సమానమే అయినను, ఈ లోకమున మర్త్యుడను వ్యవహారము ఒక్క మనుష్యునకు మాత్రమే ఉన్నది. అందుచేతనే భూలోకము మర్త్యలోకమని కొనియాడబడుచున్నది. పిచ్చుక మొదలగు జంతు ప్రకృతి నుండి కాల వైపరీత్యములను తెలుసుకొను మానవుడు తనను జంతువు అంటే ఒప్పుకోడు. సమస్త జీవరాశికి సృష్టికర్త యగు సూర్యుని తండ్రిగా భావించి ఆయన ఉదయించక మునుపే మేల్కొని సూర్యోదయమైతే గాని లేవనని పట్టుదల పట్టిన

మానవజాతిని తమ కిలకిలా రావములతో వీనులవిందు కలిగించుచూ మేల్కొలుపుచున్న పక్షుల విషయమై వాటిని తనకు ఆహారముగా ఉపయోగించుకొనుచున్న మనుష్యుడు దానవుడు కాక మానవుడెట్లగును? అయినా తనను దానవుడంటే ఒప్పుకోడు. మానవుడని గౌరవించవలెనట. ఇకపోతే చెట్లను నరికి, పక్షులను సంహరించి, జంతుమాంసభక్షకుడగు మానవుడు తానే భూలోకమున అధినేతగా అభిమానించుకొనుచు, అణుభేదముతో మారణాయుధములను సృష్టించుచు వాటిని వినియోగించుటకు తాపత్రయపడుతు, భూమిని పిండి పిల్చి, గుల్ల చేయుచూ, రసాయనిక ప్రక్రియలతో తన సాటి జీవరాశిని కూడా చూడక సర్వే సర్వత్ర మానవుడు మారణహోమము చేయుచున్నాడు. "తన ప్రగతి" భవిష్యన్మానవాళికి అధోగతి కాగలదని తెలియక కాదు, తాత్కాలిక స్వప్రయోజనములకు, ఆభాసిక సుఖములకు, తన పబ్బమును గడుపుకొనుటకు ప్రయత్నము చేయుచున్న నేటి మానవత ఇతర జాతులకే కాదు తన జాతికి కూడా ముప్పు కలిగించుచున్నది. కాకులకు, చీమలకు ఉన్న జాత్యభిమానము కూడా మానవతకు లేదు.

నేటి మానవత యొక్క ఆలోచనా సరళి ఇలాగున్నది:-నాగరికతయనగా సాంకేతికాభివృద్ధి గాని వేరొకటి కాదని, విజ్ఞానశాస్త్రము అభివృద్ధి పొందుచున్నది. రసాయనిక ప్రక్రియలు తెలియని ఋషులు అనాగరికులని తలంచుచున్నది.

ఏ పదార్థమందు ఏ ధర్మమున్నదో దానిని దర్శించుటయే సత్యము. మనిషి ప్రాపంచిక సత్యముచేత సత్యాన్వేషి కాలేడు. దానికి తోడు జడమగు సాంకేతిక విచారణ చేత తాను జడుడగుచున్నాడు. తన బుద్ధిని, నేత్రములను ఒకటేమిటి సర్వేంద్రియములను సాంకేతిక పరతంత్రములుగా చేసి ప్రేమ, దయ, సత్యము, అహింస, దానము, మొదలగు మానవగుణములకు అతి దూరములో ఉన్నవాడై తన విశ్వాసముతో చంద్రమసాది గోళములను తన అక్కున సమీపమున ఉన్నవని భావించి మిలియన్ల కొలది డాలర్లు వెచ్చించి కాలమును వృధా చేసికొనుచు, భౌతికవాదిగను, హేతువాదిగను, నాస్తికునిగను మారుతున్నాడు. దేశవ్యాప్తముగా తక్కువ పరిధిలో ఉన్న మానవత - భౌతిక వాదమని, కార్మికవాదమని, విప్లవవాదమని, ఉగ్రవాదమని పలు తెరంగుల వర్గములుగా ఏర్పడి పరస్పర విద్వేషములతో తుచ్ఛమగు స్వార్థ ప్రాతిపదికతో మానవతా వ్యవస్థను సర్వనాశనము చేయుచున్నది. వ్యవస్థను తన ఆలోచనా సరళిలోనికి మానవుడు మల్చుకొన్నంత కాలము ఈ ముప్పు తప్పదు.

ఇక ప్రపంచ వ్యాప్తముగా భౌగోళికముగా విచారించినచో సామ్రాజ్యవాద వాదమునకు కూడా ఈ స్వార్థ చింతయే మూలకారణమయినది. సృష్ట్యాది నుండియు ఓతప్రోతముగా సాగుచున్న అనంత శబ్దశక్తియగు వేదరాశి మానవతా వ్యవస్థను సరియగు మార్గమున నడుపుచున్నది. అయినను తన మతమే తనదని తన ఊహకి అందిన తీరున మానవులకు మతముల పేరిట ఉద్రేకము రేకెత్తించి మత ప్రాతిపదికతో దేశములను కొల్లగొట్టి అన్ని మతములకంటే పూర్వమే ఉండి త్రికాలా బాధ్య సత్యప్రతిపాదికములగు వేదములు పౌరుషేయములని, అభూతకల్పన చేసి, చరిత్రను తారుమారు చేసి, రచింపచేసి మానవతను పెడత్రోవను పట్టించిన ఘనత సామ్రాజ్యవాదులదే. నేటి మానవుడు - ఆ మాటలనే చిలక పలుకుగా చేసికొని వేదముల తాత్పర్య స్వభావములు తెలియక వారు రచించిన చరిత్రనే బాల్యమాదిగా అభ్యసించుచు తన మేధస్సును దురుపయోగము కావించుకొనుచున్నాడు.

అన్ని జీవరాశులకు అర్థకామములు సార్వత్రికమైనా ధర్మపురుషార్థము మానవతకు అతిరిక్తమగుటచే ధర్మప్రాతిపదికతోనే మునుపు రాచరికము రాజ్యమేలినది. "అప్యర్థ కామౌ తస్యాస్తాం ధర్మాయైవ మనీషిణః" అని కాళిదాస మహాకవి నిర్వచించినాడు. ఏడంస్మిత్, మార్షల్ మొదలగువారి సిద్ధాంతముల ననుసరించు నేటి

ప్రభుత్వములు ధర్మమునకు ప్రాధాన్యములేకుండా చేసి ఖజానాలు ఖాళీచేసి "కాకులకు కొట్టి గ్రద్దలకు వెయ్య" అను సామెత ననుసరించి సగటు-మానవుని ఆర్థిక సంక్షోభములో ముంచి లేవనెత్తుతు నిరుద్యోగ సమస్యతో స్వవృత్తులను కోల్పోయి, శ్వవృత్తి నాశ్రయించి తట్టుమిట్టాడుతున్న ప్రజలకు వేదబోధ ఎక్కడిది? ధర్మమార్గ మెక్కడిది? మానవ ధర్మమునకు ఆటపట్టయిన "మనుస్మృతిని" నడిబజారులో తగలబెట్టిన ఒక పండితం మన్యుని అనుసరించుచు మానవధర్మములనే తగలపెట్టుచు "గతానుగతికః" అను సూక్తికి నిదర్శనమైన నేటి భారతజాతిని నేటి రాచరికము ఉపేక్షించుచున్నదే? సరియగు దృష్టితో చూచిన రాగద్వేషములకు అతీతమై మానవతా వ్యవస్థను తీర్చిదిద్దిన మనుస్మృతి ఏ మానవునకు అన్యాయము చేయలేదని నిర్ణీతమగును. దర్శనలోపము - దృష్టిలోపమే విపరీతార్థభావనకు మూలకారణము.

"రేఖామాత్రమపి క్షుణ్ణా దామనోర్వర్త్మనః పరమ్|
సవ్యతీయుః ప్రజాస్తస్యనియన్తుర్నేమివృత్తయః||" అను మేధావి వచనము ననుసరించి, దర్శ విప్లవ రహితముగా మానవధర్మ శాసనములననుసరించి ప్రభుత్వములున్నచో శాంతిభద్రతలు తమంతట తామే ఏర్పడును. ఇది మినహాయించి ఎన్ని ప్రభుత్వములు మారినా ఎంతమంది బుద్ధుడు మొదలగు ప్రవక్తలు ఆవిర్భవించినా క్రమశిక్షణా రూపమగు సత్యధర్మములను మానవులు ఎవరంతటవారు అనుసరించునపుడే మానవుడు తనకు శాంతిని తన వలన లోకమునకు శాంతిని సమకూర్చిన వాడగుచున్నాడు.

ధర్మ వ్యవస్థకు ఆలవాలమయిన వేదముల చేతనే ధర్మాధర్మములు విచారణీయములు.

"బరి తప్పిన గొడ్డును కొట్టంలోకి రాజేయడానికై పచ్చిగడ్డి నాశజూపుతారు. అలాగే సదాలోచనలతో మనస్సును లోభ పెట్టవలె.

ప్రశ్న: *కాని అది నిశ్చలంగా ఉండదే ?!*

'వెలి తిరుగుట కలవాటైన ఎద్దుకు వెలి తిరగడమే సరదా ! దాన్ని కొట్టం జేర్చడానికి ఏపుగా పెంచిన పచ్చిగడ్డియే మార్గం. అప్పటికీ అది ఇరుగుపొరుగు పొలాలు తిరగటం మానదు. ఆ పొలాల్లాంటి గడ్డే తాను కొట్టంలో నున్నా లభిస్తుందన్న నమ్మకం దానికి క్రమంగా కల్గించవలె. కొంత కాలానికది కొట్టంలో ఉండిపోవడం నేర్చుకుంటుంది. తరువాత తరువాత దాన్ని వెలికి తరిమినా పొరుగు పొలాల్లో పడక తిన్నగా కొట్టానికే వచ్చే రోజులు వస్తాయి. అలాగే మనస్సును సరియైన మార్గాన నడిచేట్లు తీర్చవలె. క్రమంగా అది ఋజుపద్ధతి కలవాటు పడి చెడుదారులకు పోదు'

*శ్రీ రమణ భాషణములు. పుట* **618.**

# నా జ్ఞాపకాల్లో శ్రీ జ్ఞానానంద స్వామీజీ

*- జిన్నూరు, శ్రీ నాన్నగారు - ( బి.వి.యల్. యన్. రాజు)*

పూజ్యశ్రీ జ్ఞానానంద స్వామీజీ శిష్యులలో ఆత్మానంద స్వామీజీ అని ఒకరు ఉండేవారు. నేను ఆత్మానంద స్వామీజీ కలిసి **1954**వ సంవత్సరంలో ఉత్తర భారతదేశ యాత్రలకు వెళ్ళినాము. ఆకాలంలో శ్రీ జ్ఞానానంద స్వామీజీ ఢిల్లీలో ఉండేవారు. ఆత్మానంద, నేను కలిసి ఢిల్లీలో స్వామీజీ నివాసమునకు వెళ్ళినాము. ఆనాటికి నా వయస్సు ఇరువది సంవత్సరములు మాత్రమే. ఆత్మానంద స్వామీజీ నన్ను శ్రీ జ్ఞానానంద స్వామీజీకి పరిచయం చేసినారు. నన్ను, ఆత్మానంద స్వామీజీని ఆయన ఎంతో ఆదరించి ``టీ" ఇచ్చినారు. ఆత్మానంద జ్ఞానానంద స్వామీజీ గురించి నాతో మాట్లాడుతూ ఆయన ఎంతో తపో సంపద గలవారని, సైన్సు రంగములో అంతర్జాతీయ ఖ్యాతి గడించారని, సైన్సు రంగమునకు ఆయన జీవితమును అంకితము చేశారని, వేదాంత శాస్త్రమును నిజ జీవితములో ఆచరించి చూపించిన మహానుభావుడని అన్నారు.

జ్ఞానానంద సమక్షములో ఒక గంట కాలము గడిపాము. వారిని దర్శించటం అదృష్టంగా భావించాము. ఆయన సమక్షంలో ఎవరికైనా జ్ఞానమును సముపార్జించాలనే కాంక్ష ఉదయిస్తుంది.

పూజ్య స్వామీజీ ఆంధ్రా యూనివర్శిటీలో పనిచేస్తున్న రోజులలో ఒక రోజున ఆయనను కలుసుకొన్నాను. మాటల సందర్భంలో ఆయన ఇలా అన్నారు. `చేతులు మురికి అయితే వాటిని సబ్బుతో కడిగి శుభ్రము చేస్తాము. అదే విధముగా అంతః కరణములో ఉన్న దోషములను, సాధన చేసి తొలగించుకోవలెను. సాధన లేకుండా సిద్ధి కలగదు. రాగ ద్వేషములను సాధన చేసి తొలగించుకోవలెను. రాగ ద్వేషముల చేత పీడింపబడే మానవుడు దైవమును ధ్యానము చేస్తే వాటి నుండి విడివడతాడు. ధ్యాన నిష్ఠలవలన ఆలోచన యొక్క లోతులు పెరుగుతాయి. మానవ స్వభావములో ద్వైతము ఉన్నది. అందువలన లోకములో అనేక ఆకర్షణలకు గురి అవుతాడు. ఏ ఆకర్షణకు గురి అయినా పరిణామంలో పతనమవుతాడు. గమ్యమును చేరుకోలేడు. జీవిత గమ్యం అద్వైతానుభవం. సజ్జన సహవాసము వలన, సత్కర్మను ఆచరించుటవలన మానవుడు తన స్వభావమును మార్చుకోవచ్చును. మారు మనస్సు పొందినవాడికి మాత్రమే తన హృదయములో ఉన్న నిజం ప్రత్యక్షమవుతుంది. మానవుని స్వరూపములో శాంతి ఉన్నది. కాని ఆ స్వరూపం, అరూపం కాబట్టి శాంతి అందటం లేదు"

త్యాగి కానివాడు జ్ఞాని కాలేడు. పూజ్య స్వామీజీ పుట్టుకతోనే త్యాగ గుణము కలవారు. ఆయన బహుముఖమేధావి. ఆయన మెదడులో అన్ని కోణములు వికసించినవి. సైన్సు వేదాంత శాస్త్రము పరస్పరము విరుద్ధమైనవి కావని, పరస్పరము సహకరించుకొంటాయని ఆయన జీవితము నిరూపించినది. ఆయన జీవితము పొడవునా నిర్మాణాత్మకముగా పనిచేశారు. అనేక మందిని సత్యాన్వేషకులుగా తీర్చిదిద్దారు. మనకు ఆయన రూపము కనపడకపోయినా, ఆయన వాణి వినపడకపోయినా సైన్సుపరంగా, వేదాంతపరంగా ఆయన చేసిన కృషి చిరకాలము నిలబడి ఉంటుంది.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# సర్వయోగపరిపూర్ణుడు

**ఉష**

ఆత్మ స్వేచ్ఛాసక్తుడై
భవ బంధ విముక్తుడయ్యే
తపః సంపన్నుడు
మునిపుంగవుడు, జ్ఞానానందుడు

విజ్ఞానాసక్తుడై
దేశభాషాతీత తీరాలకు
తరలి మరలి వచ్చె
విజ్ఞానానందుడు

ఆధ్యాత్మిక రహస్యశోధకుడు
అణుశాస్త్ర పరిచ్ఛేదుడు
జ్ఞాన విజ్ఞానానందుడు
ప్రకృతి ఆరాధకుడు

కవి, కావ్యానందుడు
మానవాళి ప్రేమికుడు
ప్రేమానందుడు
విద్యా విజ్ఞానాసక్తి రగిలించె

అందరిలో విద్యానందుడు
పిన్నల పెద్దల నలరించిన
హాస్యానందుడు
ఆధ్యాత్మిక, భౌతిక సమన్వయకర్త

పూర్ణానంద స్వరూపుడు
పూర్ణసూత్ర సముపేతుడు
సమస్త యోగ పరిపూర్ణుడు

**నా మాట:** తెలిసీ తెలియని వయస్సులో ఒకే ఒకసారి స్వామీజీని చూసాను. ఆయన ప్రవచనాలు అర్థం చేసుకోగలిగే సంస్కారం ఇంకా నాకు లేదు. కానీ ఆయనతో చిరుపరిచయ మయినా, చిరపరిచయంగా, అందరినీ ఆకట్టుకునే, అమితానందం కలిగించగలిగే ఆయన శక్తిని గురించి విని, మిడి మిడి జ్ఞానంతో ఉడతాభక్తిగా వ్రాసిన మాటలివి.

రాముడిని భరతుడు కొలిచినట్లు, అనుంతిత ప్రేమతో, భక్తితో స్వామీజీకి జీవితం అంకితం చేసి, స్వామీజీ వాక్కు ప్రచారం చెయ్యాలన్న జీవితాశయాన్ని సఫలం చేసుకుంటున్న మామయ్య శ్రీ భూపతిరాజు పద్మనాభరాజు'గారికి, జ్ఞానానంద శత జయంతి సందర్భంగా నా యీ చిన్నకవిత అంకితం.

ప్రశ్న: *మనస్సుకు చూపదగ్గ సన్మార్గాలేవి ?!*

సమాధానం: *దైవచింతన.*

"కర్మల వల్ల సమాధి స్థితి జారిపోవుననే భయం అజ్ఞాన లక్షణం. ఎట్టి కర్మలైనా సరే జ్ఞాని నంటవు. వాని మనసెప్పుడూ నిత్యశాంతిలో నిమగ్నమై యుంటుంది."

*శ్రీ రమణ భాషణములు. పుట* ***618.***

దక్షిణ భారతదేశానికి తెలియని

# రాధాష్టమి

డాక్టర్. మల్లిప్రియ "నాగరాజు"



"అమృత మధుర మృదుతర వచనేన
జ్వలితనసా మలయజ పవనేన
సఖీ! యారమితా వనమాలినా
సఖీ! యారమితా వనమాలినా" అన్నారు జయదేవ మహాకవి.

"కృష్ణప్రేమమయీరాధా
రాధాప్రేమ మయో హరిః
జీవనేన ధనే నిత్యం
రాధాకృష్ణా గతిర్మమ" అన్నారు శ్రీవల్లభాచార్యులవారు.

"రాధానే వ్రజవాస్ కియా
మీరానే వనవాస్ కియా" అని వ్రాసుకొన్నది వ్రజచంద్ర చకోరి మీరాబాయి.

"వ్యత్యస్త పాదారా విందా" అంటూ రాధా కృష్ణులకే నృత్యం నేర్పారు శ్రీ నారాయణ తీర్థులవారు.

"సంధ్యావందన భద్రమస్తు" అంటూ తనకు స్నానం, సంధ్య వంటి ఏ నియమాలు అక్కరలేదని, తమాలవృక్షం క్రింద కూర్చొని, రాధాకృష్ణుల ధ్యానించటమే తన లక్ష్యమని చెప్పుకొన్నారు శ్రీ లీలాశుకయోగి. "కృష్ణకర్ణామృతం" వ్రాసిన ఆయన తొలుత చింతామణీ వ్యామోహపీడితుడైన బిల్వమంగళుడు. కృష్ణతత్త్వంలో ఎంత స్థాయికి ఎదిగాడంటే

"బాలాయ నీలవపుషే
నవకింకిణీక జాలాభిరామ జఘనాయ
దిగంబరాయ, శార్దూల దివ్య నఖభూషణ
భూషితాయ, నందాత్మజాయ నవనీతముషే"

అని బాలకృష్ణుని సౌందర్యాన్ని మరెవ్వరూ వర్ణించలేనంత గొప్పగా వర్ణించగలిగాడు.

"భక్తలోక గమనీయరూప కమనీయ కృష్ణ పరిపాహిమాం" అన్నారు మేల్పత్తూర్ నారాయణ భట్టతిరి వారు "నారాయణీయం"లో, తమ పక్షవాతాన్ని గురువాయూర్ శ్రీకృష్ణుని దయవల్ల పోగొట్టుకొని.

రాధాకృష్ణ సంకీర్తనామృతంలో రత్న గర్భయైన భారతావనిని ఉర్రూతలూగించారు శ్రీ చైతన్య మహాప్రభువు (గౌరాంగుడు)

ఇంకా విద్యాపతి, చండీదాస్, 'జ్ఞానప్పాన' మళయాళ కావ్యం వ్రాసిన మహాకవి పూన్తానమ్ నంబూద్రి, 'కృష్ణాట్టమ్' వ్రాసిన మాన వేదన్ మహారాజు, కురూరమ్మ (మలయాళ కవయిత్రి), అంధకవి సూరదాస్ మహాశయుడు - ఇలా ఎందరో రాధాకృష్ణుల భక్తితత్త్వాన్ని ప్రచారం చేసారు.

ఇంతకూ ఎవరీ రాధ?

ఆమె ఎప్పుడు అవతరించింది?

ఎలా అవతరించింది?

మన దక్షిణ భారతదేశంలో కృష్ణాష్టమి జరుపుకొంటామే తప్ప, రాధాష్టమి జరుపుకోం. ఉత్తర హిందూస్థానంలోని బృందావనం, మధుర, ద్వారక, బర్‌సానా మొదలగు చోట్ల కృష్ణాష్టమే కాక, రాధాష్టమి కూడా అద్భుతంగా జరుపుకొంటారు. ఇక్కడ గౌడీయ మఠాలలోనూ, కేరళలోని గురువాయూర్‌లోగల పరమ పవిత్రమైన శ్రీకృష్ణాలయంలో మాత్రమే రాధాష్టమి జరుపుతున్నారు. బృందావనంలోనూ, గుంటూరు లోనూ 'రాధాకృష్ణ మందిరాలు' నిర్మించిన 96 ఏళ్ళ నాన్నగారు (శ్రీ రాళ్ళబండి వీరభద్రరావు మహోదయులు) రాధికా పరమేశ్వరి గూర్చి నేటికీ విశేష ప్రచారం చేస్తున్నారు. దక్షిణభారతదేశంలో ఎక్కువమందికి తెలియని రాధికను గూర్చి కొంచెం తెలుసుకొందాం!

అది కృతయుగం, సుచంద్ర మహారాజు, కళావతీదేవి దంపతులకు రత్నమాల, మేనక అనే కుమార్తెలు జన్మించారు. మేనకను హిమవంతునకిచ్చి వివాహం చేసారు. వారికి కల్గిన కుమార్తెయే జగన్మాత పార్వతీదేవి. అప్పటివరకూ బ్రహ్మచారిగా వున్న సాక్షాత్తు పరమేశ్వరునకు ఆమె అర్థాంగియైంది. ఆ రోజుల్లో లక్షల సంవత్సరాలు ఆయుర్దాయం ఉండేది. త్రేతాయుగం వరకూ బ్రహ్మచారిణిగా వున్న సుచంద్రుని రెండవ కుమార్తె రత్నమాల జనకమహారాజును వివాహం చేసుకొంది. వారి కుమార్తె సీతాదేవి (నాగేటిచాలులో దొరికిన అయోనిజ). ఆమె పురుషోత్తముడైన శ్రీరామ చంద్రుని వివాహమాడింది.

ఇక సుచంద్రుడు దీర్ఘకాలం బ్రహ్మదేవుని గూర్చి తపస్సుచేసాడు. బ్రహ్మ ప్రత్యక్షం కాగానే మోక్షం కోరాడు. కాని సుచంద్ర పత్ని కళావతీదేవి అడ్డుపడింది. "బ్రహ్మదేవా, ఆయనకు మోక్షం ఇస్తే నేనేం కావాలి? నీ వరం మమ్మల్ని విడదీస్తే నిన్నూ - నీ బ్రహ్మలోకాన్ని నా పాతివ్రత్య మహిమతో భస్మీపటలం చేస్తాను. జాగ్రత్త! మా దంపతులం ఏ లోకానికి వెళ్ళినా కలిసే జంటగా వెళ్ళాలి" అంది. "తథాస్తు, మీరిద్దరూ రాబోయే జన్మలో రాధాదేవికి జననీ జనకులై ఏకకాలంలో గోలోక మోక్షం పొందుదురు గాక!" అన్నాడు బ్రహ్మదేవుడు.

ద్వాపర యుగాంతంలో భలందన నృపతి యజ్ఞం చేస్తుంటే, ఆ సమయంలో యజ్ఞ గుండం నుంచి కళావతి జన్మించింది. ఈ జన్మలో ఆమె పేరు "కీర్తిదా". సుచంద్ర భూపతి అంతకుముందే పరిపూర్ణ జ్ఞానంతో సురభానుడనేవానికి కుమారుడుగా జన్మించాడు. ఈ జన్మలో ఆయన పేరు వృషభానుడు, కాలక్రమేణ వారికి వివాహమైంది. "కీర్తిదా" గర్భం ధరించింది. అది మామూలు గర్భం కాదు. జల, వాయుపూరితమైన మాయాగర్భం.

ఒకనాడు వృషభానుడికి రాధాదేవి స్వప్నంలో కనుపించి, భాద్రపద శుద్ధ అష్టమినాడు తాను ఆకాశం నుంచి రెండేళ్ళ బాలికగా భూమిపైకి వస్తానని, "రావల్" గ్రామానికి రమ్మని ఆయనను కోరింది. తన వృషభానుపురం నుంచి (నేటి బర్‌సానా) బంధుమిత్రులతో వృషభానుడు ఆ రోజు "రావల్"గ్రామం చేరాడు.

భాద్రపద శుద్ధ అష్టమి (కృష్ణుడు జన్మించిన అష్టమికి సరిగ్గా 15 రోజుల అనంతరం). సరిగ్గా తెల్లవారుజామున 5 గంటలకు ఆకాశం నుంచి రెండేళ్ళ బాలికగా దివ్యతేజస్సుతో రాధ భూమి మీదికి దిగింది. వృషభానుడు తన రెండుచేతులతో ఆమెను అందుకున్నాడు.

"కమలాక్షునర్చించు కరములు కరములు" అన్నారు పోతనమహాకవి. ఆ కమలాక్షునే శాశ్వతంగా తన వాణ్ణిచేసుకొన్న పుణ్యమూర్తియైన రాధమ్మను ఎత్తుకొన్న వృషభానుని చేతులు నిజంగా ఎంత పుణ్యం చేసుకొన్నవో గదా!

వృషభానుడు మహావైభవంగా ఆ పసిపాపను బర్‌సానాకు తెచ్చాడు. ఆ దంపతులు ఆమెను పదేళ్ళు పెంచారు. అంతే! 12 ఏళ్ళు రాగానే రాధమ్మలో పెరుగుదల ఆగిపోయింది. 12 ఏళ్ళ బాలికగానే శాశ్వతంగా నిల్చిపోయింది. ఆమె

సీతలాగే అయోనిజ.

"అయోనీ సంభవా దేవీ వాయు గర్భా కళావతీ సుషాప మాయు యా వాయుణ సాతన్నావిర్భ భువహా" అని "బ్రహ్మవైవర్త పురాణం చెబుతోంది.

అసలు రాధమ్మ ఆకాశం నుంచి రెండేళ్ల బాలికగా భూమిపైకి అవతరించగానే ఈ భూమి పులకరించింది. రాళ్ళు గంధర్వగానం చేసాయి. ఎండిన మోడులు చిగురించాయి. దేవులపల్లి కృష్ణశాస్త్రి సాహిత్యంలో చెప్పాలంటే

"పచ్చనితోటలు, విచ్చినపూవులు

ఊగే గాలుల తూగె తీగల "తో రాధా మహాదేవి అవతరించిన నాడు ప్రకృతే హర్షపుల కాంకితమైంది.

ఇక రెండేళ్ళ బాలికగా ఆమె నీలమేఘాలను చూసి కేరింతలు కొట్టేదట. (తన స్వామి నీలమేఘశ్యాముడని కాబోలు). బాలిక పెరిగే కొద్ది ఆమె విచిత్రంగా ప్రవర్తించసాగింది. "పాడెడి వేళ, చెలులతో నాడెడి వేళ, జలకము లాడెడివేళ, ఖాదు భుజించు వేళలన్ గోపకుమారుని దివ్యనామ సంస్మరణ మ్మొనర్చుచును గాని కాలము వ్యర్థపుచ్చదదెట్టి పుణ్యమో!" అన్నారు పండిత హరికథక హంస శ్రీమాన్ పెద్దింటి సూర్యనారాయణ దీక్షిత దాస భాగవతార్.

"యోబ్రహ్మ రుద్ర శుక నారద భీష్మముఖ్యైః
రాకాంక్షితో న సహసా పురుషస్య తస్య
సద్యో వశీకరణ చూర్ణ మనంత శక్తిం
తం రాధికా చరణ రేణు మహంస్మరామి"

బ్రహ్మ, రుద్ర, శుక, నారద, భీష్మాది ప్రముఖులంతా ప్రయత్నించి, దర్శనం చేసుకోవాలన్నా దుర్లభుడైన పురుషోత్తముడగు ఆ శ్రీకృష్ణ పరమాత్ముని తక్షణమే (వెన్వెంటనే) వశం చేసుకొని, శాశ్వతంగా తన వద్దే నిక్షిప్తం చేసుకొన్న అనంతశక్తియైన రాధికా పాదధూళిని (చరణ రేణువులను) స్మరించి తరిద్దాం.

నవ్యవన రత్న పేటియైన రాధా వధూటి మనందరినీ రక్షించుగాక!

"చెట్టును చూడు. కొమ్మలను కొట్టివేసినా తిరిగి ఎదుగుతుంది. కూకటివేరు చెడనంత కాలము అది పెరుగుతూనే ఉంటుంది. ఆ విధంగానే సంస్కారాలు వ్యక్తి చనిపోయేప్పుడు హృదయంలో లయమౌతవి. అవి నష్టము గావు. సరియైన కాలానికి అవి హృదయం నుండి తిరిగీ మొలకెత్తుతవి. జీవుని పునర్జన్మ రీతి యిది."

ప్రశ్న: *హృదయంలో నడగి ఉన్న సూక్ష్మ సంస్కారము లేమి ?! దాని నుండి యింతటి విశాల విశ్వం విస్తరిల్లుటేమి ?*

మహర్షి సమాధానం: *అల్పాల్ప బీజము నుండి అత్యున్నతమైన మర్రిచెట్టు ఎదిగిరాదా? అట్లే వివిధ నామరూపములతోడి యీ విస్తృత విశ్వం హృదయం నుండి ప్రసరిస్తుంది.*

*శ్రీ రమణ భాషణములు.*

# శ్రీ స్వామి ప్రణవానంద శతజయంతి

**అక్కిరాజు రమాపతిరావు**

గురుశిష్యుల శతజయంతి ఒకే సంవత్సరంలో జరగటం అదొక ఆహ్లాదకరమైన ఉదంతం. విశిష్టమైన విషయం. గురువుగారు శిష్యుడి కంటే సుమారు ఒక సంవత్సరం చిన్నవారు. అయినా తపోధనులకు వయసు పరిగణన ఎందుకు? 'వృద్ధా శిష్యా గురుర్యువా ' అని కదా! ఆదిగురువు దక్షిణామూర్తి ఎప్పుడూ యువకులే. ఆదిశంకరుడు త్రిదశుడే. ఇంతకూ ఈ గురుశిష్యులెవరు? శ్రీ స్వామి జ్ఞానానంద భగవత్పాదులూ, శ్రీ స్వామి ప్రణవానంద మహోదయులూ. శ్రీ స్వామి ప్రణవానంద **1896** జనవరి **14**వ తేదిన జన్మించారు. అంటే తెలుగు వారి సంక్రాంతి పండుగ నాడన్నమాట. వీరి గురువర్యులు, పరివ్రాజక దీక్షను అనుగ్రహించిన ఆచార్యపాదులు శ్రీ స్వామి జ్ఞానానంద అదే సంవత్సరం అంటే **1896** డిసెంబర్ **5**వ తేదీన జన్మించారు. ఈ **1896**వ సంవత్సరానికి ఏదో విశిష్టత ఉన్నట్లున్నది. భగవాన్ శ్రీ రమణులు అరుణాచలేశ్వరుణ్ణి అన్వేషిస్తూ తిరువణ్ణామలై చేరి అచల ప్రతిష్ఠులైంది ఆ సంవత్సరమే.

శ్రీ స్వామి జ్ఞానానంద ప్రాచీన కాలపు మహర్షుల వలె, శంకర రామానుజ మధ్వ గురు పరంపరవలె, ప్రస్థానాచార్యుల వలె **556** సూత్రాలతో భక్తి, జ్ఞాన, కర్మ, హఠ, రాజయోగాల సమాహారమైన పూర్ణసూత్రాలనే ప్రస్థాన గ్రంథం కూర్చారు. వ్యాస భగవానుడి బ్రహ్మసూత్రాల వంటి దీగ్రంథం. ఈ సూత్ర సంపుటికి ఎప్పుడో ఏ మహానుభావుడో భాష్యం వ్రాయవలసి ఉంది. ఏ శంకరభగవత్పాదుల వంటి సర్వంకషమనీషా విభువులో, ఏ స్వామి వివేకానంద వంటి మహోదాత్త అవతార మూర్తులో మాత్రమే పూనుకొని నిర్వహించవలసిన మహత్కార్యమది. శ్రీ స్వామి జ్ఞానానంద గురుదేవులకు పరివ్రాజక దీక్ష నిచ్చిన మహనీయులు పూర్వాశ్రమంలో శ్రీ శరచ్చంద్రసేన్ అనే స్వామి పూర్ణానంద సుగృహీత నామధేయులు. తమాషా ఏమంటే గురువర్యులు సన్యాస దీక్ష స్వీకరించిన మరురోజే శిష్యవర్యులు ఆ గురుదేవుల నుంచి పరివ్రాజకదీక్ష స్వీకరించారు. గురుదేవుల పట్ల తమ 'ఆత్మీయ'తకు గుర్తుగా కావచ్చు శ్రీ స్వామి జ్ఞానానంద తమ సూత్ర ప్రస్థాన గ్రంథానికి 'పూర్ణసూత్రాలు'అని నామకరణం చేశారు. ఏ విధంగా చూసినా ఈ పూర్ణసూత్రాలు అన్వర్థమైనవే. ఇదే విధంగా శ్రీ స్వామి ప్రణవానంద ఆధ్యాత్మ విద్యా శిరోభూషణమైన భగవద్గీతకు అత్యంత విపులమూ విశేష విషయ వివరణ శోభితమూ, వ్యాఖ్యాన సుందరమూ పరమార్థ పరిపూత కోవిదమూ అయిన భాష్య గ్రంథం రచించి దానికి 'జ్ఞాన దీపిక' అని పేరు పెట్టడం హృదయంగమమైన విషయం.

శ్రీ స్వామి జ్ఞానానంద, శ్రీ స్వామి ప్రణవానంద ఇరువురూ ఒక్కే జిల్లాకు చెందిన వారు కావటం యాదృచ్ఛికం. అయినా దిక్కాద్య వచ్చిన్న జ్ఞానావతారులు కదా పరివ్రాజక శ్రేష్ఠులు. శ్రీ స్వామి ప్రణవానంద పూర్వాశ్రమ నామధేయం శ్రీకనకదండి వేంకట సోమయాజులు. వీరి పూర్వీకులు విజయనగర సంస్థాన ఆస్థాన విద్వాంసులు. తెలుగునాట 'విస్సన్న చెప్పింది వేదం' అనే నానుడికి ప్రథితులైన శ్రీ ఇంద్రగంటి విశ్వపతి శాస్త్రి, అఖిల భారతంలోనూ వ్యాకరణ పాండితీ సార్వభౌములు, అశేషశేముషీ దురంధరులైన భాగవతుల హరిశాస్త్రుల వారు కనకదండి వారికి బంధుకోటిలోని వారే. కనకదండి అనే

ఇంటిపేరే మహా భావ సుభగంగా ఉంది. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి మహోదయుల కథలు - గాథలలో, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి మహోదయుల ఆత్మకథ 'అనుభవాలూ - జ్ఞాపకాలూను' అనే విశిష్ట రచనలో విజయనగర సంస్థాన మహా విద్వాంసుల తపస్సంపన్నత, మంత్రశక్తి మహిమలు, విద్యాగరిమ, హృద్యానవద్యమైన సన్నివేశాలుగా ప్రస్తావితమైనాయి.

గొప్ప విషయం ఏమంటే శ్రీ కనకదండి వేంకట సోమయాజుల గారిని ప్రభావశీలమైన వయస్సులో భారత జాతీయోద్యమం అనే స్వాతంత్ర్య సంగ్రామం అత్యంతం ఉత్తేజితులను చేసింది. పందొమ్మిది, ఇరవై సంవత్సరాల వయసుననే ఆయన సర్వాత్మనా 'స్వాతంత్ర్య సంగ్రామ, యజ్ఞ దీక్షితులైనారు. వారి ఉత్సాహో ద్రేకాలకు ఆంధ్రదేశం గోష్పదీకృతం అయి పోయింది. అప్పట్లో లాల్- బాల్ - పాల్ ప్రభ భారతదేశమంతా పర్వి ఉండేది. అందువల్ల లాహోర్‌లో లాలాలజపతిరాయ్ స్థాపించిన దయా నంద ఆంగ్లోవేదిక్ కళాశాలలో చదవటానికి శ్రీ సోమయాజులు ఉత్సుకత చూపటంలో ఆశ్చర్యం లేదు. శ్రీ సోమయాజులు గారు ఆంధ్రదేశంలో సుప్రసిద్ధ శనిక్షేత్రమైన మందపల్లికి సమీపంలోని యేనుగుల మహల్‌లో జన్మించారు. ప్రాథమిక మాధ్యమిక ఉన్నత విద్యాభ్యాసాలు ఆ ప్రాంతం లోనే పూర్తి చేసుకొని కళాశాల విద్యాభ్యాసానికి ఆయన లాహోర్ వెళ్ళారు. **1915** నుంచే ఆయనలో స్వాతంత్ర్యోద్యమ కాంక్ష పెల్లుబికింది. భారత దేశంలో తీవ్ర సంచలనం రేకెత్తించిన జలియన్ వాలాబాగ్ దురంతాలకు ఆయన ప్రత్యక్ష సాక్షి. రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. తుపాకి మడమపోటుతో ఆయన తృటిలో తప్పించుకున్నారు. ఆ రోజుల్లో అక్కడ మార్షల్ లా అమలులో ఉండేది. పాఠశాల, కళాశాల విద్యార్థులు బ్రిటిషు సైనికుల పర్య వేక్షణలో రోజూ తమను తాము నాలుగు సార్లు హాజరుపరచుకోవలసి ఉండేది. ఒకసారి విప్లవ కారుల సంఘం అమెరికా స్వాతంత్ర్యోద్యమం అనే గ్రంథాన్ని దక్షిణ భారతంలో ప్రచారం చేయటానికి ఆయనకు అప్పగించారు. ఆయన ఉంటున్న బసను మిలిటరీ వాళ్ళు సోదా చేసినప్పుడు ఆయన చాకచక్యంగా వంట ఇంటి చిమ్నీలో వాటిని భద్రపరచి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. **1918**లో లాహోర్‌లో ఇన్‌ఫ్లుయెంజా వ్యాధి తీవ్రంగా చెలరేగింది. ఆ సమయంలో ఆయన వ్యాధి బాధితులకు ఎంతో సేవచేశారు. లాహోర్‌లోని దయానంద వేదిక్ కళాశాల వారు హిమాలయ సానుసీమలలోని ఘర్వాల్ జిల్లాలో **1918**లో ప్రబలిన కరువులో సహాయక కార్యక్రమాలకు శ్రీ సోమయాజులుగారిని పంపించారు. ఆ విధంగా ఆయనకు హిమా లయాలతో సాన్నిహిత్యం కలిగింది. అక్కడ వారికి శ్రీ స్వామి జ్ఞానానంద పరిచయభాగ్యం కలిగింది. శ్రీ సోమయాజులు గారు కూడా సన్యాసాశ్రమాన్ని స్వీకరించారు. తదాదిగా వారు స్వామి ప్రణవానంద అయినారు. **1928**లో వారు కైలాస మానస సరోవరయాత్రను విజయవంతంగా నెరవేర్చారు. అప్పటి నుంచి వారు కైలాస మానస సరోవరయోగి అని ప్రథిత యశస్కులైనారు. అదే సంవత్సరం డిసెంబర్‌లో వారు లాహోర్ సందర్శించిన రోజులలో సాండర్స్ అనే బ్రిటిషు పోలీసు అధికారిని అకలంకోజ్జ్వల దేశభక్తుడు సర్దార్ భగత్‌సింగ్ మట్టుపెట్టిన సంఘటన జరిగింది. భగత్‌సింగ్ డి.ఎ.వి. కళాశాల భవనసముదాయం నుంచి తప్పించుకొనిపోయాడు. అందువల్ల ఆ కళాశాలలో జాతీయోద్యమ నేతగా గుర్తింపుపొందిన శ్రీ స్వామి ప్రణవానందపై ఒక సంవత్సరం పాటు తీవ్రమైన పోలీసునిఘా కొనసాగింది. ఆయన కాశ్మీరుకు వెళ్ళి అమర్‌నాథ్ గుహలో కొంతకాలం నివసించగా ఆ నిఘాను బ్రిటిషు ప్రభుత్వం ఉపేక్షించింది.

**1921** ప్రాంతంలో ఆయన తణుకులో ఒక హిందీ విద్యాలయాన్ని స్థాపించి జాతీయోద్యమ ప్రచారం చేశారు. **1923**లో కాకినాడలో జరిగిన

అఖిల భారత జాతీయ కాంగ్రెసు సమావేశాలలో సేవాదళ సభ్యుడిగా పనిచేశారు. ప్రభుత్వం ఆయన్ను నిర్బంధించి 10 నెలల పాటు జైలుపాలు చేసింది. 1926లో ఆయన మళ్ళీ హిమాలయాలకు వెళ్ళారు. 1928లో మొదటిసారి కైలాస మానస సరోవరాన్ని దర్శించిన నాటి నుంచీ 23 సంవత్సరాల కాలం ఆయన హిమాలయాలలోనే గడిపారు. హిమాలయాలలో ఆయన తపోధ్యాన నిరతులు కావడమే కాక హిమవత్పర్వత భౌగోళిక పురాతత్వ విజ్ఞానాన్ని పరిశోధించి ప్రపంచానికి తెలియని ఎన్నో విషయాలను బయటపెట్టారు.

రాహుల్ సాంకృత్యాయన్ లాగానే శ్రీ ప్రణవానంద స్వామి టిబెట్ లామాలకు, టిబెట్ ప్రజలకు అత్యంత ప్రీతిపాత్రులు. టిబెటీయులు శ్రీ ప్రణవానంద స్వామిని గొప్ప హిందూయోగిగా గౌరవించేవారు. హిమాలయ ప్రాంతాలలో శ్రీ స్వామి వారు పేద ప్రజలకు ఉచితంగా వైద్యంచేసేవారు. హిమాలయ ప్రాంతాలన్నిటా ఆయన ప్రాచీన కాలపు శిలాజాలను సేకరించారు. భూగోళశాస్త్రం, భూగర్భశాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం, పురాతత్త్వ శాస్త్రం దృష్ట్యా హిమాలయ విశేషాలను శ్రీ స్వామి ఎన్నో కనిపెట్టారు. పాకిస్తాన్, చైనాలు హిమాలయ ప్రాంతాలలో కొనసాగించిన విద్రోహ చర్యలను ఎప్పటికప్పుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికీ, భారత కేంద్ర ప్రభుత్వానికీ తెలుపుతుండేవారు. చైనీయులు వీరి ఉనికిని కంటగించుకొని వీరి నేవిధంగానైనా పరిమార్చాలని చూశారు. వీరి శిరస్సుపై గొప్ప పణం ప్రకటించారు. కాని స్వామివారు సైనిక స్థావర ప్రాముఖ్యంగల హిమాలయ మార్గాల అనుపానులను, భారతప్రభుత్వం వారు తమ భౌగోళిక సరిహద్దుల మానచిత్రాలలో ఉపేక్షించిన దోషాలను చేయవలసిన సవరణలను ప్రభుత్వం వారి దృష్టికి తెచ్చారు. శ్రీ స్వామి వారి సలహా మేరకు భారతప్రభుత్వం ఎన్నో తప్పులను దిద్దుకున్నది తన మానచిత్రాలలో.

శ్రీ స్వామి వారు 25 చాతుర్మాస్య వ్రతాలు హిమాలయాలలోనే నిర్వహించడం గొప్ప విశేషం కైలాస మానస సరోవరతీరంలో శ్రీ స్వామి వారు గడ్డ కట్టిన చలి కాలంలో నివసించేవారు. నీరుగడ్డ కట్టటాని కన్నా కూడా 50 డిగ్రీల దిగువ స్థాయి వాతావరణంలో మానస సరోవరం కూడా పూర్తిగా గడ్డకట్టిపోయిన స్థితిలో అక్కడ పరిశోధనలు నిర్వహించారు శ్రీ స్వామి. కైలాస పర్వతం చుట్టూ 36 సార్లు ప్రదక్షిణం చేశారు శ్రీ స్వామి. కైలాస మానస సరోవరం చుట్టుకొలత 54 మైళ్ళు. ఈ సరోవరానికి 33 సార్లు ప్రదక్షిణం చేశారు శ్రీ స్వామి. మానస సరోవరం నుంచి ప్రభవించే బ్రహ్మపుత్ర, సింధు, శతద్రు (సట్లెజ్), సరయు (కర్నాలీ) నదుల ఉత్పత్తి స్థానాలను కనుగొన్నారు. అంతకు పూర్వం స్వీడిష్ దేశీయుడైన డా. స్వెన్ హెడిన్ నిర్ణయాలే ప్రామాణికంగా గ్రహించబడేవి. కాని స్వామి వారి పరిశోధనల వల్ల మానస సరోవరం లోతుకు సంబంధించీ హిమాలయ నదుల ప్రభవ స్థానం గురించి కొత్త నిర్ణయాలు అంగీకారం పొందాయి. ఒక మోటారు నౌక ద్వారా శ్రీ స్వామి కైలాస మానస సరోవరం లోతును, సుమారు 19 వేల అడుగుల ఎత్తున నెలకొన్న గౌరీకుండమనే హ్రదం లోతును కొలిచి అత్యపూర్వమైన విషయాలను ప్రపంచానికి ఆవిష్కరించారు. మానస సరోవర విహారానికి తాముపయోగించిన నౌకకు వారు 'జ్ఞాన నౌక' అని పేరు పెట్టారు.

హిమాలయ పర్వతాలలో కనిపించే కస్తూరి మృగాన్ని గురించి గొప్ప పరిశోధనలు చేశారు స్వామి. అట్లానే మంచు మనిషి ఉనికిని గూర్చి పరిశోధించారు. వారణాసి, లక్నో, పాట్నా, కలకత్తా విశ్వవిద్యాలయాలలో తాము హిమాలయాలలో సాగించిన పరిశోధనల గూర్చి ఉపన్యసించారు. కైలాస మానస సరోవర చిత్రవస్తు ప్రదర్శన శాల నాయన రూపొందించగా దానిని లక్నోలోని రాష్ట్ర మ్యూజియం స్వీకరించింది. బీహారులోని భగల్పూర్ సమీపంలోని 'బరారి' గుహల నాయన ఆవిష్కరించి బీహార్ పరిశోధన సంస్థ పత్రికలో

ఎన్నో మౌలికమైన ఫలితాలు ప్రకటించారు. విక్రమశిల విశ్వవిద్యాలయం బౌద్ధ మత మహోచ్ఛ్రాయ స్థితిలో ఏ ప్రాంతంలో నెలకొని ఉండేదో వారు పురాతత్త్వ శాస్త్ర సాక్ష్యాధారాల ద్వారా నిరూపించారు. ఇంతకు పూర్వం ఈ పనిచేసిన వారు ఎవరూ లేరు. 19 కోట్ల సంవత్సరాల పూర్వకాలం నాటి యుగానికి సంబంధించిన ప్రాచీన శిలాజాలను సేకరించి భారత ప్రభుత్వ భూగర్భ శాస్త్ర సర్వేక్షణ శాఖకు అందజేశారు.

అన్నిటికన్నా ప్రముఖంగా పేర్కొన వలసింది శ్రీ స్వామి ప్రణవానంద భారతదేశంలోని శ్రీ చక్ర సంప్రదాయాన్ని గూర్చి చేసిన పరిశోధన. భారతదేశంలో ఎక్కడెక్కడ శ్రీ చక్ర యంత్రాలు ప్రతిష్ఠితమై ఉన్నాయో వాటినన్నిటినీ పరి శీలించారు శ్రీ స్వామి. మహా త్రిపుర సుందరి ప్రతీకాత్మక శ్రీ చక్రమేరు యంత్రాన్ని (3" x 3" x 3") రెండు టన్నుల బరువు గల నునుపైన శిలపై రూపొంధింపచేసి యేనుగుల మహల్‌లో వారు ప్రతిష్ఠింపచేశారు. భారతదేశ మంతటిలోనూ ఇది పెద్దదైన శ్రీ చక్రం. గౌరగనమూడిలో వల్లభ గణపతిని కూడా శ్రీ స్వామి వారు ప్రతిష్ఠింప చేశారు. భారతదేశంలో ఇంకొక్క చోట మాత్రమే ఇటువంటి దేవాలయం ఉన్నది.

శ్రీ స్వామి ప్రణవానంద రచించిన కైలాస మానస సరోవర గ్రంథానికి జవహర్‌లాల్ నెహ్రూ ఉపోద్ఘాతం రాశారు. టిబెట్‌లో పరిశోధనలన్న వారి ఉద్గ్రంథానికి శ్యామప్రసాద్ ముఖర్జీ తొలిపలుకు వ్రాశారు. 1938లోనే పాల్ బ్రంటన్ 'ది హెర్మిట్ ఇన్ ది హిమాలయాస్ ' అనే రచనలో శ్రీ స్వామివారి గూర్చి ప్రపంచానికి ఎరుకపరిచారు. తొంభై మూడు సంవత్సరాల వేదోక్త పరిపూర్ణమైన వయసున శ్రీ స్వామి ప్రణవానంద నిర్యాణం చెందారు. ఈ సంవత్సరం వారి శతజయంతిని తెలుగువారు స్మరించుకోవడం సముచితం.

*

"సుఖ దుఃఖాలు గతంలోని కర్మఫలము; ఇప్పటి కర్మలవి కావు. సుఖదుఃఖాలు ఒకటి వెంట నొకటిగా వరుసగా వస్తాయి. సహించుటో సంతోషించుటో ఓర్పుతో చేయదగునే కాని వాని వెంటదగిలి అవశుడు కారాదు. ఎప్పుడూ ఆత్మనంటిపెట్టుకో యత్నించవలె. కార్యపరతలో ఫలితముల లెక్కింపరాదు."

"శరణాగతి వల్ల సత్త్వాన్ని పెంచుకో. నీ బలం వృద్ధి అయ్యే కొద్దీ నీ పరిసరాలు బాగుపడుతున్నట్లు గుర్తిస్తావు."

"దైవ నామము శక్తి మంత్రము. దాన్ని జపించడమంటే దాని శక్తిని స్మరించడ మన్నమాట."

"వాసనలు చిరంతనంగా బహుజన్మలుగా వస్తున్నవి. అంచేత అవి బలపడ్డవి. సహజ స్థితి అంటే ఆనందం నిలద్రొక్కుకోవలె నంటే ఆ వాసనలు పోవలె."

"ఇచ్చు గుణము బాగా పెరిగితే అది జ్ఞానానికి తెచ్చి చేరుస్తుంది."

శ్రీ రమణ భాషణములు.

# శ్రీ రామయోగి

"విద్యల నేర్వకున్నను విజ్ఞానము లభించును; పురుషకారమును జేయవలసినది, సాధనామార్గమున భక్తి శ్రద్ధలున్న ఫలము తనంతటలభించును" అను సూత్రముల కీయన చరిత యుదాహరణము.

నెల్లూరు పట్టణమునకు బశ్చిమమున నున్న వేదాద్రి (నరసింహులకొండ) చెంగటి మోపూరు గ్రామము వీరి జన్మస్థానము. వంశము దానధర్మములకు జ్ఞానసాధనమునకు బ్రసిద్ధి కెక్కినది. రెడ్డిజాతి. తండ్రి చేవూరి పిచ్చిరెడ్డి. మూడు తరములుగ నీవంశమునొక్కడే పుత్రుడు. పుత్త్రోదయము తర్వాత కొలదికాలమునకే తండ్రి స్వర్వాసియగును. అట్లే వీరు పసిబాలుడుగ నున్నప్పుడే వీరిజనకులు దిగవంతులైనందున వీరు మేనమామల యింట బుచ్చిరెడ్డిపాలెము చెంగటి అన్నారెడ్డి పాలెమున బెరిగిరి.

ఒక్కడు, సంపన్నుడు, యౌవనము వచ్చినది. కొంతకాలము భావియోగి రామయ్య భోగిరామయ్యగా విజృంభించినను రాజసమునను సత్యనిరతిని ధర్మ ప్రవణతను కోల్పోలేదు. చిన్నతనమునందే రామనామ ప్రీతియు `వాల్మీకి వలె నేను నెప్పుడగుదునా' యను తీవ్రవాంఛయు కబీరు వలె విరాగియైయుండు నావేదనయు గలదు. కావున ధ్యానమును మొదలిడిరి.

సుకృతవశమున వారికి పందొమ్మిది సంవత్సరములు వచ్చునప్పటికి శ్రీ బ్రహ్మ నంద తీర్థస్వామి సద్గురువై తారక మంత్రము నుపదేశించెను. దినమునకైదువేల జపముంజేయ గుర్వాజ్ఞ; అనుక్షణము ఏమి చేయుచున్నను జపమును సాగించు దీక్ష శిష్యునిది. వైరాగ్యోద్రేకమున నతడు కాశికి పోవుచుండగా దారిలో గురువు ఎదురయి ``మీ అమ్మ అనుజ్ఞ నిచ్చినదా" అని యడిగెను. "ఆమెకు జెప్ప నైనలేదని" రామయ్య అనెను. ఊరిలోనే తోటలో నేకాంతముగ జపము చేసి కొమ్మనియు దాను వచ్చిచూతుననియు గురువతని మరల నిల్లు జేరబంపెను. జపమునకు దోడు రామయోగి సాత్త్వికాహారియై ప్రాణాయామము నెవరి సాహాయ్యమును లేక యారంభించెను. తీవ్రసాధనచే త్వరలోనే నాదబిందుకలా ద్యనుభవములు ముందు కలిగినను త్వరలోనే యవి యడగిపోయెను. నాసాగ్ర దృష్టియై ధ్యానమును కొనసాగించుచురాగా తత్స్థానమునుండి జ్యోతిర్మయముగ నొక సర్పచలనము బయలుదేరి శిరస్థానమున లీనమైనట్లు తోచెను. ముందు గననగుచుండిన రామరూప మడగిపోయినది. ఎల్లయెడల జ్యోతిస్సముద్రము. ఏ రూపములేదు.

``ఏమిది?" యనిరామయ్య యూరి పండితులనడిగెను. కాని యెవరును చెప్ప లేకపోయిరి. శ్రీ బ్రహ్మానంద తీర్థులు అప్పటికి దివంగతులైనారు. చెప్పువారు లేనిస్థితి యందు తాను జిన్నతనమున యాత్రాసందర్భమున జూచిన అరుణాచల మహర్షి జ్ఞప్తికివచ్చి యచటికి బోయి రామయోగి వారి నడిగెను.

మహర్షి సమాధి దశయందు దృగ్దృశ్యము లేకమయి పోవునని సందియముదీర్పగా వారే గురువులని తర్వాత చాలా కాలము మామిడి గుహయందు దపముచేసి కొనుచుండెను.

(తరువాత) పెద్దల నాటి నుండి తాము చేయు ధర్మములబరిపాలించునిమిత్తమును తమ్మునమ్ముకొని యున్న మాత కూరట గల్పించు నిమిత్తమును ఇతర శిష్యుల కొరకు అన్నారెడ్డి పాలెమున 'శ్రీరామాశ్రమము' నిర్మించుకొని కొంతకాలమక్కడను మరికొంతకాలము శ్రీ

రమణాశ్రమమున గురువు చెంతను గడుపుదురు. గురు కార్యార్థ మాయన పండ్రెండ్లనుండి పరిపాలించిన మౌనవ్రతమును ఇటీవల వీడిరి. పాలి తీర్థమును బాగుచేయించుటకు, రమణ తీర్థమునకు, హాలు వేయించుటకు నితరాశ్రమ కార్యముల కెంతో ధనమును యోగిగారొసంగినారు. స్వామికి (శ్రీ రమణ మహర్షికి) వీరి యందధికప్రీతి. వీరికొరకే వారు 'ఉపదేశానుసారము' ఉన్నది - నలువది' తెనుగున వ్రాసినారు. వీరి సహృదయత్వమును విశ్వ ప్రేమను గుర్తించి సర్పలాది దుష్టజంతువులును వీరికి హాని చేయవు. పాల్ బ్రంటన్ తనకు సాన్నిధ్యము చేతనే ప్రశాంతి నొసంగిరని వీరిని తన 'గుప్త భారతాన్వేషణము'న నెంతయో ప్రశంసించినాడు. సిద్ధులును గలవని చెప్పుదురు. వీరి శిష్యబృందమును వీరి జయంత్యుత్సవమునేటేట జరుపుచున్నారు.

'శ్రీ రమణ లీల' నుంచి

"ప్రశ్న: *ప్రపంచంలో ఎనలేని దుఃఖమున్నది. దుష్టులే లెక్కకు మిగిలియున్నారు. ఇచట సుఖమెట్లు లభిస్తుంది ?*

**సమాధానం:** ***మన కందరూ గురువులే. దుష్టులు వారి చెడు చేతలలోనే తమ దరికి రావద్దనడం లేదా ! సజ్జనులెప్పుడూ సజ్జనులే. ఈ రీతిగా అందరూ మనకు గురువులే "***

"ఒక నాయనార్ దేవ దర్శనానికని కాళహస్తి వెళ్ళాడు. వాని కందరూ శివుడుగా, శక్తిగా కనుపించారు, తానట్టివాడే గనుక. ధర్మపుత్రుడు ప్రపంచంలోని జనులెల్లరూ ఏదో యొక విధంగా పుణ్యశీలురనీ ఏదో నొక కారణంగా తన కన్న మిన్నలనీ భావించాడు. దుర్యోధనుని కింత ప్రపంచంలోనూ సుజనుడే అగుపించలేదు. వాని వానికి వాని ప్రతిబింబమే గోచరిస్తుంది."

"మనస్సు నిశ్చలమయితే అది సమాధి, ప్రపంచం కనుపించినా కనిపించకున్నా".

- *శ్రీ రమణ భాషణములు.*

"భగవంతుని అనుగ్రహం వలన మీకు డబ్బు, చదువు, కీర్తి వచ్చాయి అనుకోండి. అవి సమాజమునకు ఉపయోగపడేలా ఉండాలి కాని, వాటి వలన మీరు చెడిపోయేలా ఉండకూడదు. అవి మీ కంట్రోల్‌లో ఉండాలి. కాని మీరు వాటి కంట్రోలులో ఉండకూడదు. భగవంతుడు మిమ్ములను ఏ మంచి విషయాలతో అయితే అనుగ్రహించాడో వాటిని సమాజమునకు ఉపయోగించాలి. సమాజంలో ఉన్నవాడు దేవుడే కాబట్టి తద్ద్వారా దేవుని అనుగ్రహానికి పాత్రులవుతారు"

- *జిన్నూరు శ్రీ నాన్నగారు*

- *శ్రీ రమణాశ్రమము."*

ఆధ్యాత్మిక యోగ సాధకుడు

# పాల్ బ్రంటన్

అక్కిరాజు రమాపతిరావు

పాల్‌బ్రంటన్ ఈ శతాబ్ది భారతీయ తత్త్వ జిజ్ఞాసువు లందరికీ బాగా పరిచితుడు. ఈయన క్రీ.శ. 1898లో లండన్‌లో జన్మించారు. ఇంగ్లాండులోనూ అటు తర్వాత అమెరికాలోనూ విద్యాభ్యాసం చేశారు. తత్త్వ శాస్త్రంలో ఆయనకు డాక్టరేట్ లభించింది. ఆయన మత వేదాంత తత్త్వ శాస్త్ర విషయాలను గూర్చి ఎన్నో గ్రంథాలు వ్రాశారు. ప్రపంచంలో అనేక భాషలలో ఆయన పుస్తకాలు అనూదితమైనాయి. `ఎసెర్చ్ ఇన్ సీక్రెట్ ఇండియా' (రహస్య భారతదేశంలో అన్వేషణ) అనే బ్రంటన్ గ్రంథం పందొమ్మిది ముద్రణలు పొందినట్లుగా తెలుస్తున్నది.

యోగతత్త్వ దర్శనం సాధించటానికి ఆయన ఎంతగా శ్రమించారో ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చు. భారత దేశంలోని ఎందరో యోగులను, మహాత్ములను బ్రంటన్ దర్శించారు. సత్య దర్శనం నిమిత్తం తీవ్ర ఉత్కంఠతో గురువును అన్వేషిస్తూ ఆయన భారత దేశమంతా పర్యటించారు. కాని ఆయనకు ఎందరో ఐంద్రజాలికులు, బైరాగులు, కపట సాధువులు కూడా తారస పడ్డారు. కొన్ని ప్రదేశాలలో కొందరు మహాత్ములను ఆయన దర్శించినా వారు ఆయనను పూర్తిగా ఆకర్షించి తృప్తి కలిగించలేదు. ``నేను నా మనోరథం తీరకుండానే భారత దేశం నుంచి నిష్క్రమించాలా? పాతకాలపు ఋషిపుంగవులు ఈ దేశం నుంచి నామరూపాలు లేకుండా తిరోహితులైనారా" అని ఆయన ఒకప్పుడు వేదన చెందటం కూడా జరిగింది.

ఆయన మద్రాసులో బసచేసినప్పుడు కె.ఎస్. వెంకట రమణి అనే రచయితను కలుసుకున్నారు. ఈయన పత్రికారచయితకూడాను. తమ స్నేహితుడి నుంచి వెంకటరమణికి ఆయన ఒక పరిచయలేఖ కూడా తెచ్చారు. బ్రంటన్ ఇటువంటి పరిచయలేఖలెన్నిటినో తనతో వుంచుకొన్నాడు ఎప్పుడు ఏ అవసరం వస్తుందోనని. అయితే ఈ పరిచయలేఖల అవసరం ఆయనకు అటు తర్వాత కలగలేదు.

వెంకట రమణి మద్రాసు యూనివర్సిటీ సెనేట్ సభ్యులు. ఆయన గొప్ప కథలు వ్రాశారు. ఇంగ్లీషులోనూ తమిళంలోనూ ఆయన గొప్ప రచయిత. ఆయన పాల్ బ్రంటన్‌ను కలుసుకున్నారు. ఇద్దరూ ఇష్టాగోష్ఠిలో పొద్దుపుచ్చారు. ఆనాటి రాజకీయాలను గూర్చి చర్చించుకున్నారు. సాహిత్యంలో తమ ప్రజ్ఞను పరస్పరం ఎరుక పరచుకొన్నారు. ప్రస్తావికంగా తన జిజ్ఞాసను వెల్లడించాడు పాల్‌బ్రంటన్. భారతదేశంలో తానెందుకు పరిభ్రమిస్తున్నదీ చెప్పాడు. `భారత దేశంలో నిజమైన మహాత్ములు, యోగ సాధకులు ఉన్నారా? ఉంటే వారిని తాను దర్శించగలడా? వారు తన తత్త్వదర్శన ఫలసిద్ధికి తోడ్పడగలరా?` అని తన ఆదుర్దాను వ్యక్తం చేశారు బ్రంటన్. ఇంతలో యాదృచ్ఛికంగా శ్రీ కంచి కామకోటి పరమాచార్య స్వామివారు తమ పర్యటనలో చెంగల్పట్టు వచ్చినట్లు తెలిసింది. శ్రీ. కె.ఎస్. వెంకటరమణి తమ గురువర్యులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి వారి దగ్గరకు పాల్ బ్రంటన్‌ను తీసుకొని వెళ్ళారు. శ్రీ స్వామివారిని దర్శించి తన ఆందోళనను, అశాంతిని, జిజ్ఞాసను, ఆర్తిని, తపనను, ఆరాటాన్ని వెల్లడించి ఏదైనా సాధనోపాయాన్ని, మార్గాన్ని సూచించ వలసిందిగా అర్థించాడు పాల్ బ్రంటన్. శ్రీ స్వామి వారు అరుణా చలంలో అచల ప్రతిష్ఠితులైన శ్రీ రమణులను దర్శించవలసిందిగా బ్రంటన్‌కు సలహా చెప్పారు. పాల్ బ్రంటన్ వెళ్ళి శ్రీ రమణులను దర్శించారు. ఆయన సమక్షంలో ఎంతగానో తనగోడు వెళ్ళబోసుకున్నారు. తన

అనుభవాలను, తనకు లభించిన చిత్త శాంతిని గూర్చి 'ది మెసేజ్ ఆఫ్ అరుణాచల' అనే గ్రంథంలో వివరించారు బ్రంటన్.

పాల్ బ్రంటన్ అరుణాచల శ్రీ రమణులను దర్శించినప్పటి అనుభవాలు 'శ్రీ రమణలీల' అనే గ్రంథంలో చక్కగా వర్ణితమైనాయి.

" మహర్షి సన్నిధి నుండగానే బ్రంటన్ నిద్రా - జాగ్రదవస్థల మధ్యబడినట్లయ్యెను. ఆ సన్నిధానమున బ్రసరించుచున్న శాంతి అతనిని గూడ బూర్ణముగ ముంచివైచినది.

మరి కొంత కాలమున కాస్వల్ప జాగ్రచ్ఛేషమును నష్టమైన బ్రంటన్ స్పష్టమగునొక స్వప్నమును గాంచెను. తాను చిన్ని బాలకుడైనట్లు, మహర్షి తన్నరుణాద్రి శిఖరమునకు గొంపోయినట్లు, వెనుదిరిగి మహర్షి తన ముఖమునే తిరముగ పరికించినట్లు తానును ఏది యో ప్రాప్తించు నాసతో వారి ముఖమును లక్షించినట్లు తోచెను"

మహర్షి అతడితో ఇట్లా అన్నారుట. నీ వచటికి (పాశ్చాత్య దేశాలకు మరలి వెళ్ళినప్పుడు) మరలినపుడు ఇప్పుడు నీకున్న శాంతి అక్కడను స్థిరముగ నీకు ఉండును. కాని నీపై నింకొక భారమున్నది. నీవు 'నేను ఈ దేహమును, లేదేని ఈ మెదడును' అనుభావనను వీడవలెను. ఈ శాంతి నీకు లభించి నిలుచుటకు నీ యహంకార పూరిత జీవనమును మరవవలయును"

'సత్యాన్ని తెలుసుకోవటానికి జనపదాలు విడిచి పెట్టి కీకారణ్యాలకు పోవాలని యోగ సాధకులంటారు. అది వినా గత్యంతరం లేదా? అని అడిగాడు బ్రంటన్ - దానికి మహర్షి ఇట్లు సమాధానం చెప్పారు.

'కర్మాచరణాన్ని విడువనక్కరలేదు. ప్రతిరోజూ ఒక గంట, రెండుగంటల పాటు ధ్యానం అభ్యసిస్తే నీ విధులను నెరవేరుస్తూనే ఉండవచ్చు. క్రమమార్గంలో ధ్యానిస్తే ఇతర కార్యాలు చేస్తున్నప్పుడు కూడా ఈ ప్రవాహం సాగుతూనే ఉంటుంది. ఒకే భావాన్ని రెండు విధాలుగా వ్యక్తీకరించగలిగితే ధ్యాన లక్ష్యానికి ఉన్ముఖుడవై ఉన్నట్లే కార్యాచరణంలో కూడా ఉంటావు'

దీని వల్ల ప్రయోజనం ఏమంటే ' జనులు, ఘటనలు, విషయాలపట్ల నీ దృష్టి క్రమంగా మారి పోతుంది. తమంతట నీ కర్మలు కూడా ధ్యానానుగుణ్యములవుతాయి. స్వార్థం బంధహేతువు. దాన్ని త్యజించాలి. ఈ అసత్యమైన జీవితాన్ని విడవటమే నిజమైన త్యాగం'

ప్రపంచంలో కార్యాచరణమూ స్వార్థ త్యాగమూ ఎట్లా పొసగుతాయి అని బ్రంటన్ ప్రశ్నించగా. 'కర్మ వివేకాలకు వైరుధ్యంలేదు' అన్నారు మహర్షి. ఇది వరకటిలాగానే ఉద్యోగంలో అన్ని పనులూ చేస్తున్నప్పటికీ జ్ఞానం పొందవచ్చునా' అని అడిగాడతడు. ఎందుకు పొందగూడదు? కాని ఆ విధంగా చేస్తున్నప్పుడు మునుపటి ఆ వ్యక్తే ఆకార్యాలు చేస్తున్నాడని ఎవరూ అనుకోరు, ఏమంటే ఈ స్వల్పజీవనము (అహం) పోయి చిత్తము విస్తృతము అయి 'తత్'ను చేరిపోతుంది.

పనిలోమునిగిపోయిన వాడికి ధ్యానానికి కాలమేదీ? అని అడిగాడు బ్రంటన్. అప్పుడు మహర్షి ఇట్లా చెప్పారు. అధ్యాత్మికవిద్యలో, ఓనమాల' వారికే ధ్యానానికి ప్రత్యేక కాల నియమం అవసరమవుతుంది. కొంచెము ముందుకు సాగితే పనులలో ఉన్నా ఉండకపోయినా లోపల ఉన్న ఆ ఆనందరాజ్యానుభవం ఉండనే ఉంటుంది. చేయి సమాజం మధ్యనే ఉన్నా తల ఏకాంతంగానే ఉంటుంది'

తమరుపదేశించేది యోగమార్గం కదా అని ప్రశ్నించాడు బ్రంటన్. 'కాని ఒక తేడా ఉంది. ఆ మార్గంలో కర్ర పట్టుకొని గొల్లవాడు పశువును స్వాధీనంలో ఉంచుకొని కట్టి వేసేట్లు సాధకుడు బలాత్కారంగా మనస్సుని గమ్యస్థానానికి చేరు స్తాడు'. నేను చెప్పే ఈ మార్గంలో కసవును చూపి పశువునాకర్షించేట్లు సాధకుడు చిత్తాన్ని లాలిస్తూ గమ్యస్థానానికి చేరుస్తాడు' అంటూ

ఈ విషయాన్ని ఇంకా విశదం చేస్తూ మహర్షి బ్రంటన్ కిట్లా బోధించారు. 'నే' నెవరిని ప్రశ్నించుకో. కొనకు ఈ విచారము చేత నీలోన

మనస్సు కన్న లోతుగా వేరొకటి దాగి యున్నదని తెలియును. ఈ సమస్య సాధించితివా, అన్ని ప్రశ్నలు విడివడినట్లే' అని చెప్పారు.

అనిచెపుతూ మనుష్యుడు చిత్తశాంతిని ఆనందాన్నిపొందే విధం మహర్షి బ్రంటన్ కిట్లాబోధించారు.

`జనులందరికిని ఎప్పుడును దుఃఖ మిశ్రితముకాని యానందమే కావలెను. ఆయానందమున కొరకు ఉండగూడదు. అట్టి యానందము కొరకు క్రుచాచుచున్నారు. ఈ సంస్కారము మంచిదే, సత్యమైనదేకాని ఈ విషయము నీకు తోచుచున్నాదా? అన్నిటి కన్న తమనే వారధికముగా ప్రేమించుకొనుచున్నారనుట'

`ఆనందమే సత్యమగు మానవ సహజరీతి. సత్యముగ ఆత్మలోనే ఆనందముద్భవించుచున్నది. ఈ యానందాన్వేషణమున కర్మము తెలిసికాకున్నను ఆత్మనే ఒక్కొక్కడును వెదకి కొనుచున్నాడనుట. ఆయాత్మోపలబ్ధియయ్యెనా, అంతులేని ఆనందమును పొందినాడన్నమాట.'

ఈ విధంగా శ్రీరమణ మహర్షి సన్నిధిలో పాల్ బ్రంటన్ అనేక బోధలు, అనేక అనుభూతులు పొందాడు. అటు తరవాత కూడ యోగులను, సిద్ధులను, ఆధ్యాత్మిక దివ్య పురుషులను కలుసుకోవటానికి ఆయన భారత దేశమంతా పరిభ్రమించాడు. ఎన్నో దివ్యానుభూతులు కూడా పొందాడు.

హిమాలయ మానస సరోవరాన్ని దర్శించటానికి ఆనాటి బ్రిటిషు ప్రభుత్వపు అనుమతిని ఆయన సాధించలేకపోయినాడు. ఆ సందర్భంగానే ఆయన శ్రీ స్వామి ప్రణవానందను కలుసుకున్నారు. శ్రీ ప్రణవానంద బ్రంటన్‌కు తమ గురువర్యులైన శ్రీ స్వామి జ్ఞానానందను గూర్చి వివరించారు. బ్రంటన్ ఒక చిత్రమైన అతీంద్రియావస్థలో శ్రీ స్వామి జ్ఞానానందను సాక్షాత్కరింపచేసుకొన్నారు కూడాను.

